క్లుప్తంగా

మునగపాకలో నేడు సుబ్రహ్మణ్య హోమం

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సుబ్రహ్మణ్య హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో జరిగే హోమంలో భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక దోహదపడుతుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా అర్జీల రూపంలో అందించవచ్చన్నారు. అధికారులు అందుబాటులో ఉండడం ద్వారా సమస్య సాధ్యమైనంత త్వరలో పరిష్కారమవుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, విద్యుత్ శాఖ ఏఈ జగదీష్, వెలుగు ఏపీఎం బాలరాజు, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్

మునగపాక: మునగపాక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఏపీవో శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆడిట్ ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అభియోగాలపై విచారణ



రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న అధికారులు

కోటవురట్ల: రామచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. రైతులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు నమోదు చేశారు. జిల్లా విజిలెన్సు అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పలు అంశాలపై గతంలో వచ్చిన అభియోగాలపై విచారణ చేస్తున్నట్టు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి రైతుల అభిప్రాయాలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీడీ మణికుమార్, క్లస్టర్ ఏపీడీ చిన్నారావు, ఏపీవో నాగరాజు, ఈసీ వెంకటేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల ఎంఈవో-2గా లక్ష్మీనారాయణ



ఎంఈవో-2 లక్ష్మీనారాయణను అభినందిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

కోటవురట్ల: ఎంఈవో-2గా కె.వి.లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన శ్రీజోష్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో పాములవాక కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేస్తున్న కె.వి.లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీలో ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. ఎంఈవో-1 రామారావు, ఎమ్మార్సీ సిబ్బంది అభినందనలు తెలిపారు. విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తానని లక్ష్మీనారాయణ తెలిపారు.

మునగపాకలో వర్షం



మునగపాక మండల సముదాయానికి వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపునీరు

మునగపాక: మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా సాయంత్రానికి వాతావరణం చల్లబడడంతో పాటు మోస్తారు వర్షం పడింది. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మండల సముదాయానికి వెళ్లే రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ఉద్యోగులు, స్థానికులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. ఈ వర్షం వ్యవసాయ పంటల సాగుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

సాగు.. సాగేనా.!

- పాడైన కాలువలు, మదుముల గేట్లు, గ్రోయిన్లు
- వర్షం పడితే దిగువకు వృథాగా పోతున్న నీరు
- ఖరీఫ్ సీజన్‌కు ప్రశ్నార్థకంగా సాగునీరు



మూలకు చేరిన మూలపాలెం గ్రోయిన్



తిమ్మాపురంలో సాగునీటి కోసం కాలువకు అడ్డంగా ఇసుక బస్తాలు అడ్డుకట్ట వేసుకున్న రైతులు

ఎస్.రాయవరం:

ఈ ఏడాది అన్నదాతను ఆది నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ సాగు ముందుకు సాగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో కలవరపాటుకు గురవుతున్నారు. మండలంలో వ్యవసాయానికి సాగునీరు అందించే కాలువలు చాలా వరకు పూడుకుపోయాయి. చెరువుల మదుములు, గేట్లు, గ్రోయిన్లు పూర్తిగా పాడైపోయాయి. వీటికి మరమ్మతులు చేపట్టే నాథుడు లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాకాలంలో మండలంలో ప్రవహించే వరహానది నుంచి గ్రామాల్లో చెరువులకు నీరు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి సాగునీటి కాలువల ద్వారా పంట పొలాలకు అందుతుంది. ఆ కాలువలకు ఉన్న గేట్లు తుప్పుపట్టి పాడైపోవడంతో నీరు వృథాగా పోతోంది. ప్రతి సీజన్‌కు గత కొన్నేళ్లుగా రైతులు శ్రమదానంతో సాగునీటిని తరలించుకుని పంటల సాగు చేసుకుంటున్నారు. అది కూడా సమృద్ధిగా వర్షాలు పడినప్పుడే వీలు పడుతుంది. అడపాదడపా పడిన వర్షాలకు ఈ పనులు కూడా ఫలించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతులకు నోచుకోని ఎస్.రాయవరం-పెదఉప్పలం గ్రోయిన్

చెరువులే దిక్కు..!

మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 7 వేల ఎకరాలు. వర్షాలు పూర్తిగా అనుకూలిస్తే మరో 2 వేల నుంచి 3 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుంది. మండలంలో ఎక్కువగా వర్షాధారం పంటల సాగు కావడంతో వరహానది ప్రవాహంతో చెరువులకు నీరు రావాల్సి ఉంది. పెదగుమ్ములూరు రాతి చెరువుపై రెండు వేల ఎకరాలు, కొరుప్రోలు పెద్ద చెరువుపై 1500 ఎకరాలు, పెద ఉప్పలం చెరువుపై ఆధారపడి రెండు వేల ఎకరాలు ఆయకట్టు భూమి ఉంది. అయితే ఈ చెరువు మదుముల నుంచి కాలువల ద్వారా పొలాలకు సక్రమంగా సాగునీరు ప్రవహించడం లేదు. ధర్మవరం అగ్రహారం వద్ద పెదఉప్పలం, ఎస్.రాయవరం చానల్‌కు వెళ్లే గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టలేదు.



అస్తవ్యస్తంగా జమ్మికాలువ

ఇక 15 ఏళ్లుగా మూలపాలెం గ్రోయిన్ దెబ్బతిని మరమ్మతులకు ఎదురు చూస్తోంది. జమ్మికాలువ గ్రోయిన్ నుంచి నీరు పారే పరిస్థితి లేదు. ప్రధాన కాలువల పరిస్థితి ఇలా ఉంటే పంట పొలాలు మధ్య ఉన్న పిల్ల కాలువకు అడ్డుకట్టలు లేక ఇసుక బస్తాలు వేసుకుని వచ్చే కాస్త నీరు పొలానికి మళ్లించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి సీజన్‌కు ముందు ఇరిగేషన్ అధికారులు ఈ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని నివేదికలు తీసుకుంటున్నారు తప్ప ఆచరణలో చూపడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేక ఇప్పటికే వరి నారుమడులు ఎండుతున్న సంగతి తెలిసిందే. వ్యవసాయ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో ఖరీఫ్‌నకు సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

శ్రమదానం చేసినా ఫలితం లేదు



వరహా నదిపై గ్రోయిన్ గేట్లు, కాలువల గేట్లకు చాలా ఏళ్ల మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పుడు అవి తుప్పపటిపోయాయి. సాగునీరు ప్రవహించినప్పుడు వృథా పోతోంది. అడ్డుకట్ట కోసం శ్రమదానం చేసినా ఫలితం ఉండడం లేదు. అధికారులు ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలి.

– కోశెట్టి వెంకటరమణ, సర్పంచ్, పెదఉప్పలం

పూడుకుపోయిన కాలువలు



సాగునీటి కాలువల్లో పూడిక తీతలు సక్రమంగా చేయలేదు. ఉపాధి కూలీలు కొన్ని కాలువలు తవ్వినా సక్రమంగా పనులు చేపట్టలేదు. దీంతో వర్షాలు వచ్చి పెద్ద కాలువలు పొంగినా పిల్ల కాలువలకు నీరు అందడం లేదు.

– నూతి గోవిందు, రైతు, గోకులపాడు

మరమ్మతుల కోసం నివేదిక

మండలంలో 16 చెరువులు, ఆయకట్ట కాలువలు, వరహానది గ్రోయిన్ల మరమ్మతులకు ప్రతి ఏడాది నిధులు మంజూరు చేయలాని నివేదికలు పంపిస్తున్నాం. ఈ ఏడాది కూడా ఇచ్చాం . నిధులు విడుదల కాలేదు. ప్రధాన కాలువలకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– నమీన భాను, ఇరిగేషన్ అధికారి, ఎస్.రాయవరం

25 నుంచి మండలాల వారీగా వైఎస్సార్‌సీపీ సమావేశాలు



మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు సూచనలు వింటున్న సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యత ప్రతిపక్ష పార్టీగా మనపై ఉందని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లి మండలం కొత్తూరు మామిడివాడలోని తన స్వగృహంలో ఆయన నాలుగు మండలాల నాయకులతో సోమవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇందు కోసం నాలుగు మండలాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 25న యలమంచిలి మండలంలో, 27న రాంబిల్లి మండలం, 29న మునగపాక మండలం, 30న అచ్యుతాపురం మండలంలో ఆయా మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేస్తామన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కన్న బాబురాజు సూచనలను ధర్మశ్రీ తెలుసుకున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

- ప్రజల దృష్టి మరల్చేందుకు అక్రమ కేసులు
- కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు



యలమంచిలిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వ అక్రమాలు, అవినీతిపై దృష్టి మరల్చేందుకే ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు విమర్శించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఛాంబర్‌లో పార్టీ నాయకులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి డైవర్షన్ పాలిటిక్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా రూ.లక్షల కోట్లు అప్పు తెచ్చి అమరావతి పేరిట విచ్చలవిడిగా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోందని ఆరోపించారు. ప్రతి నెలా ఏదో ఒక వివాదాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహిస్తే అవినీతికి ఆస్కారం ఎక్కడుందని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా కక్ష సాధింపు కోసం మద్యం కుంభకోణం అంటూ అక్రమ కేసులు పడుతున్నారన్నారు. అందులో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎవరూ భయపడరని స్పష్టం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో కూటమి నేతల అరాచకాలకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అసలు మద్యం కుంభకోణం అనేదే పూర్తిగా అవాస్తవమని, అది కూటమి ప్రభుత్వ సృష్టిగా నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, సీనియర్ నాయకులు సేనాపతి రాము, ఎడ్ల వాసు, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేలా మహిళా సంఘాలు పాటు పడాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. మునగపాక వెలుగు కార్యాలయంలో సోమవారం స్వయం సహాయక సంఘాల సభ్యులు–సామాజిక అభివృద్ధి అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాలు బలోపేతం కావాలన్నారు. మహిళా సంఘాలు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ ఆర్థిక లావాదేవీలపై చర్చించుకోవాలన్నారు. ఆర్థిక స్వావలంబనపై సంఘ మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ, వెలుగు సిబ్బంది వేణు, శ్రీను, రామకృష్ణ, నాగమణి, అనురాధ, నిర్మల, వెంకటలక్ష్మి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం ఎంఈవో-2 శ్రీరామమూర్తికి అభినందనలు



బాధ్యతలు చేపట్టిన ఎంఈవో శ్రీరామమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: మండల విద్యా శాఖ రెండో అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీరామమూర్తికి ఏపీటీఎఫ్ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరై విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. పాఠశాలలో సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 అప్పారావు, జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు, మండల శాఖ అధ్యక్షుడు సునీల్, ఉపాధ్యాయులు గోవిందరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పాటిపల్లిలో సర్వే నిలుపుదల చేయాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పాటిపల్లి పంచాయతీ ప్రజలు

మునగపాక: పారిశ్రామిక అవసరాల కోసం నిర్వహిస్తున్న సర్వేను నిలుపుదల చేయాలని కోరుతూ మండలంలోని పాటిపల్లి పంచాయతీ పరిధిలోని ప్రజలు సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కంపెనీల ఏర్పాటు పేరుతో అధికారులు సర్వే చేయించడం తగదంటూ రాజకీయాలకు అతీతంగా ఆందోళన చేశారు. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకోకుండా పంచాయతీ పరిధిలో సర్వేలు నిర్వహించడం సరికాదంటూ మండిపడ్డారు. సన్న, చిన్న కారు రైతులే ఈ ప్రాంతంలో నివసిస్తున్నారని, సర్వే పేరుతో పంచాయతీ పరిధిలో స్థలాలను తీసుకోవాలని చూస్తే సహించేదిలేదని గ్రామస్తులు హెచ్చరించారు. ఉన్న కొద్దిపాటి భూమిలో రైతులు పంటల సాగు చేపట్టి జీవనం సాగిస్తున్నారని, అటువంటి పరిస్థితుల్లో పేదల పొట్ట కొట్టేందుకు సర్వే చేపట్టడం సరికాదన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎలా సర్వే చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల జోలికి తాము వెళ్లమని, అయితే జిరాయితీ భూముల సర్వేను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి సర్వేను నిలిపివేయాలని కోరారు. అనంతరం తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సర్వే పారదర్శకంగా జరుగుతుందని, ప్రభుత్వం పారిశ్రామిక అవసరాల కోసం ప్రతి నియోజకవర్గంలో సర్వే చేస్తుందన్నారు. స్థానికులకు సమ్మతం లేకుండా ఎటువంటి చర్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సబ్బి శ్రీనివాసరావు, ఇల్లా నాగేశ్వరరావు, కోరుకొండ రాజు, చందనాటి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమర్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న ఎస్సీ సెల్ విభాగం నాయకులు

మునగపాక: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను ఆ పార్టీ ఎస్సీసెల్ విభాగం నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎస్సీ సెల్ నూతన కార్యవర్గం ఎంపికైన నేపథ్యంలో పలువురు నేతలు అమర్‌నాథ్‌ను కలిసి రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటుకు అవసరమైన దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గాల అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, మందా రాము తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్

నర్సీపట్నం : ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు రెండవ విడత ప్రవేశాలకు ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు. విద్యార్థులు ముందుగా వైబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఐటీఐలో సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు ఈ నెల 23న ఉదయం 9 గంటలకు ఐటీఐలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం పలు ఫీడర్లపై విద్యుత్ కోత విధిస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. కోనవానిపాలెం ఫీడర్‌పై కోనవానిపాలెం, సారిపల్లిపాలెం, కొరుప్రోలు, పెదగుమ్ములూరు గ్రామాలు, ఎస్.రాయవరం ఫీడర్‌పై ఎస్.రాయవరం టౌన్, సర్వసిద్ధి, వాతాడ ఆక్వా సరీస్, ఎస్.రాయవరం రూరల్ ఫీడర్‌పై ఉప్పరాపల్లి, లింగరాజుపాలెం , బసవ పాడు, వెంకటా పురం, వాకపాడు, సైతారుపేట, జేవీపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పూడిమడకలో పరిసరాల పరిశుభ్రత



పూడిమడకలో పొక్లెయిన్‌తో పూడిక తీస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్ : మత్స్యకార గ్రామమైన పూడిమడకలో పరిసరాలు పరిశుభ్రం చేశారు. సోమవారం గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికను పొక్లెయిన్‌తో తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు పంచాయతీ సిబ్బంది సూచించారు. పంచాయతీ వారు ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లలో మాత్రమే చెత్తను వేయాలన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలి



కె.కోటపాడులో పీవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

కె.కోటపాడు/మాడుగుల/రావికమతం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ద్వారా సరుకులను అందించడాన్ని రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు జి.కుమారి అన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ కె.కోటపాడులో ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారికి సోమవారం వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు వరలక్ష్మి, పి.భవాని, రమణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు. ఏజెన్సీలో సిగ్నల్స్ లేక పోవడం వల్ల ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం అమలు చేయడంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన 2 జి మొబైల్స్ ప్రస్తుతం పని చేయలేదని, ప్రభుత్వం 5 జి సెల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయు, ప్రాజెక్టు నాయకులు జానకి, రామలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పీవోకు వినతి పత్రం అందజేశారు. రావికమతం ప్రాజెక్ట్ కార్యా ల యం వద్ద అంగన్‌వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించి పాత పద్ధతే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షురాలు పి. వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యవేణి, సీఐటీయు మండల కన్వీనర్ వి.సత్యవతి పాల్గొన్నారు.

జీవో నెంబర్ 51ను తక్షణమే రద్దు చేయాలి

దేవరాపల్లి : గిరిజనుల అటవీ భూమి హక్కు లను కాలరాసే జీవో నెంబర్ 51ను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, ఏపి ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్య దర్శి గొర్లి దేముడుబాబు డిమాండ్ చేశారు. మండలంలోని చింతలపూడిలో సీపీఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమంలో గిరిజనులతో కలిసి మోకాళ్లపై నడిచి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేముడుబాబు, కన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 51తో గిరిజన గ్రామాలకు తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. రైవాడ ప్రాజెక్టుపై ఆధారపడ్డ వేలాది ఎకరాలు బీడుగా మారడంతో పాటు రైతులు, గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ జీవోను రద్దు చేయకుంటే గిరిజనులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.